క్లుప్తంగా

ఉప కాలువకు నీరు విడుదల చేయాలి



ఎమ్మెల్యే సత్యంకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

బోయినపల్లి: వెంకట్రావుపల్లి గ్రామంలో ఉన్న వరద కాలువ అనుబంధ ఉప కాలువకు నీరు విడుదల చేయాలని కోరుతూ గ్రామ రైతులు గురువారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను కలిసి వినతిపత్రం సమర్పించారు. స్పందించిన ఎమ్మెల్యే వెంకట్రావుపల్లి ఉప కాలువకు వెంటనే నీరు విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులను ఫోన్లో ఆదేశించారు.
వెంకట్రావుపల్లి గ్రామంలోని ఫోర్‌లేన్ రోడ్డుపై వేసిన స్పీడ్ బ్రేకర్‌తో చాలా ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్తులు ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు.

ఇంటర్నల్ మార్కుల పరిశీలన



మార్కులను పరిశీలిస్తున్న వెరిఫికేషన్ బృందం

ఇల్లంతకుంట: ఇల్లంతకుంట, కందికట్కూర్, పొత్తూరు, గ్రామాల్లోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కులు, ఎఫ్ఏ పరీక్ష ప్రతులు, వివిధ రికార్డు బుక్స్, రికార్డ్స్‌ను వెరిఫికేషన్ బృందం సభ్యులు గురువారం పరిశీలించారు. కార్యక్రమాల్లో మండల విద్యాధికారి శ్రీనివాస్ గౌడ్, వల్లంపట్ల హైస్కూల్ హెచ్ఎం దూస గోవర్ధన్, ఉపాధ్యాయులు పత్తి వంశీధర్ రెడ్డి, టి. నరేందర్‌రెడ్డి, మహేష్‌చంద్ర, కె. రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ



శివను అభినందిస్తున్న లెక్చరర్లు

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లోని మహాత్మాగాంధీ జ్యోతి బాపూలే కళాశాలకు చెందిన బచ్చపల్లి శివ జేఈఈ మెయిన్స్ 2025 ఫలితాల్లో అర్హత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రాజయ్య తెలిపారు. ఉపాధ్యాయుల బృందం అభినందించారు. ప్రిన్సిపాల్ రాజయ్య మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధించొచ్చన్నారు. లెక్చరర్లు తదితరులున్నారు.

ముస్లిం యువకుల శ్రమదానం



శ్రమదానం చేస్తున్న ముస్లింలు

వేములవాడ: పట్టణంలోని ఖబ్రస్తాన్‌లో పట్టణ ముస్లిం యువకులు గురువారం శ్రమదానం చేశారు. చెట్లు, ముళ్లపొదలు, చెత్తను శుభ్రం చేశారు. టౌన్ కమిటీ అధ్యక్షుడు అక్రమ్, నాయకులు అంజద్, ముషాహిద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహా లింగార్చన పూజ



శ్రీమహాలక్ష్మి దేవాలయంలో పూజలు

చందుర్తి: మండల కేంద్రంలోని శ్రీమహాలక్ష్మి దేవాలయ ఆవరణలో శివస్వాముల ఆధ్వర్యంలో నిర్వహించిన మహా లింగార్చన పూజను గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవాలయ వేదపండితుల మంత్రోచ్ఛరణ మధ్య మహా లింగార్చన పూజ చేశారు.

రంగరాజన్‌పై దాడిని ఖండించిన అర్చకులు



రాజన్న ఆలయం ఎదుట అర్చకులు

వేములవాడ: రంగారెడ్డి జిల్లా చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడి ఘటనను వేములవాడ రాజన్న ఆలయ అర్చకులు, ఆలయ ఉద్యోగుల సంఘం నాయకులు గురువారం ఖండిస్తూ ఆలయం ఎదుట నిరసన తెలిపారు. ప్రధాన అర్చక ఈశ్వరిగారి సురేశ్, ఉప ప్రధాన అర్చక ఆలయ యూనియన్ ఉపాధ్యక్షులు చంద్రగిరి శరత్‌శర్మ, గోపన్నగారి చందు మాట్లాడుతూ.. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చూడాలన్నారు.

బ్రిడ్జి పనులు పూర్తయ్యేదెన్నడో..?

- పిల్లర్లు నిర్మించి వదిలేశారు
- ఏడాదిగా పడకేసిన స్లాబ్ పనులు
- వేసవి ప్రారంభమైనా మొదలు కాని వైనం
- బిల్లులు రాలేదని కాంట్రాక్టర్ కినుక..?
- ప్రయాణికులకు తప్పని తిప్పలు



2024 ఆగస్టులో బ్రిడ్జి పనులు చూస్తున్న కలెక్టర్

బోయినపల్లి(చొప్పదండి): వర్షాకాలం.. శీతాకాలం దాటి వేసవికాలం ప్రారంభమైనా గంజివాగు హైలెవల్ బ్రిడ్జి పనుల్లో కదలిక లేదు. బోయినపల్లి–వేములవాడ ప్రధాన రహదారిలో స్తంభంపల్లి గంజివాగులో లెవల్ కల్వర్టు స్థానంలో రూ.1.80కోట్ల అంచనాలతో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి 2023 జూలైలో నిధులు మంజూరు చేశారు. 2023 ఆగస్టు 29న బ్రిడ్జి నిర్మాణం పనులకు భూమిపూజ చేశారు. అనంతరం నిర్మాణ పనుల్లో భాగంగా పిల్లర్లు పోశారు. పిల్లర్లపై స్లాబులు వేయకపోవడంతో హైలెవల్ బ్రిడ్జి పనులు ఆగిపోయాయి. పనుల అగ్రిమెంట్ గడువు ముగిసినా పనులు పూర్తి కాకపోవడం శోచనీయం. వర్షాకాలంలో స్లాబ్ పనులు చేయరాదనే నెపంతో పనులు ఆపినా.. వేసవికాలంలో సైతం పనులు పూర్తి కాకపోవడం గమనార్హం. గతేడాది ఆగస్టులో జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ బ్రిడ్జి పనులు తనిఖీ చేసి పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించినా పనుల్లో పురోగతి లేదు.

ప్రమాదకరంగా ప్రయాణం

హైలెవల్ బ్రిడ్జి పనులు పూర్తి కాకపోవడంతో ఇక్కడ ప్రయాణం ఇబ్బందిగా మారింది. రెండు నెలల క్రితం రాత్రిపూట గంగాధర వెళ్తున్న ఓ లెక్చరర్ బ్రిడ్జి వద్ద మొరం కుప్ప వద్ద స్కూటీ అదుపు తప్పి పడి గాయాలపాలయ్యాడు. బ్రిడ్జి పక్కకు వేసిన తాత్కాలిక రోడ్డు వర్షాకాలంలో మూడుసార్లు తెగడంతో ప్రయాణికులు చుక్కలు చూశారు. తాత్కాలిక రోడ్డు తెగిన సమయంలో బోయినపల్లి నుంచి వేములవాడ, వేములవాడ నుంచి బోయినపల్లి వెళ్లేవారు వయా అయ్యోరుపల్లి, రామన్నపేట, దేశాయిపల్లి మీదుగా ఐదు కిలోమీటర్ల మేర అదనపు ప్రయాణం చేసి ఇబ్బందులు పడ్డారు. బోయినపల్లి నుంచి వేములవాడ, వేములవాడ నుంచి గంగాధర వెళ్లే ప్రయాణికులు ఈ దారి మీదుగానే వెళ్తారు. రోడ్డు తెగిన ప్రతిసారి ప్రయాణికులు గమ్యం చేరుకోవడానికి అష్టకష్టాలు పడ్డారు.

పడకేసిన స్లాబ్ నిర్మాణం

హైలెవల్ బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా ఆరు పిల్లర్లు వేశారు. పిల్లర్లపై స్లాబులు పోసే పనులు సుమారు ఏడాది కాలంగా జరగడం లేదు. బ్రిడ్జి నిర్మాణం పనులు పొందిన ఒరిజినల్ కంట్రాక్టర్ నుంచి సబ్ కంట్రాక్టర్ పనులు చేపడుతున్నాడు. స్లాబుల వరకు చేసిన పనులకు బిల్లులు రావడం లేదనే సాకుతో సబ్ కాంట్రాక్టర్ పనుల్లో జాప్యం చేస్తున్నట్లు తెలుస్తోంది. కాంట్రాక్టర్ సుమారు రూ.కోటి మేర బిల్లుల కోసం తిరుగుతున్నట్లు చెబుతున్నారు. ఇప్పటికైనా బ్రిడ్జి స్లాబ్ పనులు పూర్తి చేసి ప్రయాణికుల కష్టాలు తీర్చాలని కోరుతున్నారు.

ఏళ్లుగా ఎదురుచూపులు



స్తంభంపల్లిలో హైలెవల్ బ్రిడ్జి కావాలని ఏళ్లుగా ఎదురు చూపులు తప్పడం లేదు. బోయినపల్లి నుంచి వివిధ పనులరీత్యా వేములవాడ వెళ్లాలంటే తీవ్ర ఇబ్బంది ఎదురవుతోంది. బ్రిడ్జి పక్కకు వేసిన రోడ్డు ఎగుడుదిగుడుగా అధ్వానంగా ఉంది. వాహనాలు అదుపు తప్పుతున్నాయి.

– నల్లగొండ అనిల్, బోయినపల్లి

బ్రిడ్జి పనులు త్వరగా పూర్తి చేయాలి



వర్షాకాలంలో బ్రిడ్జి స్లాబ్ నిర్మాణం పనులు చేపట్టొద్దని పనులు నిలిపివేసినట్లు చెబుతున్నారు. వర్షాకాలం, శీతాకాలం ముగిసి వేసవి కాలం మొదలైనా పనులు ప్రారంభం కావడం లేదు. ఇంజనీరింగ్ అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణం పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలి.

– మిట్టపెల్లి శ్రీనివాసరెడ్డి, రామన్నపేట

చర్యలు చేపడతాం



స్తంభంపల్లి హైలెవల్ బ్రిడ్జి పనులు త్వరగా ప్రారంభించాలని కాంట్రాక్టర్‌కు చెప్పాం. గత వానాకాలంలో వర్షాలు కరవడంతో స్లాబ్ నిర్మాణ పనులు జరగలేదు. కాంట్రాక్టర్‌తో పనులు చేపట్టాలని చెప్పాం. త్వరగా పనులు జరిగేలా చర్యలు తీసుకుంటాం.

– కె.విష్ణువర్ధన్, పీఆర్, ఏఈ, బోయినపల్లి

ఆలయంలో తాగునీటి తిప్పలు

కోనరావుపేట: మామిడిపల్లిలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. వేములవాడ రాజరాజేశ్వరస్వామి దత్తత దేవాలయమైన మామిడిపల్లిలో ఇటీవల జరిగిన మాఘమాస్య జాతర కోసం జాతర గ్రౌండ్ పలుచోట్ల నల్లాలు, నీటి ట్యాంకులు ఏర్పాటు చేశారు. జాతర ఉత్సవాలు ముగియగానే నల్లాలను బంద్ చేసి వాటికి బిరడాలు ఏర్పాటు చేశారు. మామిడిపల్లిలోని ఆలయానికి ప్రతి నిత్యం భక్తులు వస్తుంటారు. ఆలయంలో ఉన్న రెండు మరుగుదొడ్లు, రెండు మూత్రశాలలకు సైతం నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆలయానికి వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నల్లాలు ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

స్థానిక ఎన్నికలపై అఖిలపక్ష సమావేశం



సమావేశమైన నాయకులు

ముస్తాబాద్: మండల పరిషత్‌లో స్థానిక ఎన్నికల పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు, అభ్యంతరాలపై అఖిలపక్ష నాయకులతో అధికారులు గురువారం సమావేశం నిర్వహించారు. మండలంలోని పోలింగ్ కేంద్రాలు, బూత్‌ల వారీగా అభ్యంతరాలను స్వీకరించారు. మండల, జిల్లా పరిషత్‌తోపాటు సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వారీగా వివరాలను అఖిల పక్షం నాయకులకు వివరించామని ఎంపీడీవో బీరయ్య తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి కొండం రాజిరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు మెరుగు అంజాగౌడ్, బీఆర్ఎస్ యువజనశాఖ అధ్యక్షుడు శీలం స్వామి, నాయకులు తలారి నర్సింలు, గజ్జెల రాజు, గుండెల్లి శ్రీను, నరేశ్ తదితరులున్నారు.

రాజకీయ పార్టీలతో సమావేశం



మాట్లాడుతున్న ఎంపీడీవో జయశీల

బోయినపల్లి: ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో భీమ జయశీల గురువారం రాజకీయ పార్టీల నాయకులతో ఎంపీటీసీ, జెడ్పీటీసీ వారీగా డ్రాఫ్ట్ పోలింగ్ స్టేషన్ పబ్లికేషన్‌పై రివ్యూ నిర్వహించారు. బీఆర్ఎస్ మండల కార్యదర్శి గుంటి శంకర్, బీజేపీ మండల అధ్యక్షుడు ఎడపల్లి పరశురామ్, నాయకులు నిమ్మ శ్రీనివాసరెడ్డి, బొడ్డు రాజలింగం, ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ రవీందర్, జేఏ గడ్డం శ్రీనివాస్, వంశీకృష్ణ తదితరులున్నారు.

చందుర్తి: మండల పరిషత్ కార్యాలయంలో సాధారణ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ స్టేషన్ డ్రాఫ్ట్ లిస్టులపై మండలంలోని వివిధ రాజకీయ పార్టీల అధ్యక్షులు, నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. పోలింగ్ స్టేషన్ డ్రాఫ్ట్ లిస్టుపై అభ్యంతరాలుంటే శుక్రవారం సాయంత్రం 4 గంటల్లోగా తమ దృష్టికి తీసుకురావాలని ఇన్‌చార్జి ఎంపీడీవో బండి ప్రదీప్‌కుమార్ కోరారు. అభ్యంతరాలుంటే తుది జాబితాను శనివారం తిరిగి ప్రకటిస్తామని తెలిపారు. కాంగ్రెస్ నుంచి దారం చంద్రం, బీజేపీ మండల అధ్యక్షుడు మోకిలే విజేందర్, బీఆర్ఎస్ నుంచి బత్తుల కమలాకర్ పాల్గొన్నారు.

సరోజినీ నాయుడుకు నివాళి



ఆంగ్ల ఉపాధ్యాయున్ని సన్మానిస్తున్న విద్యార్థులు



సనుగులలో నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

వీర్నపల్లి: మండలంలోని గర్జనపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం నైటాంగిల్ ఆఫ్ ఇండియాగా పేరు పొందిన స్వాతంత్ర్య సమరయోధురాలు, భారత తొలి మహిళా గవర్నర్ రచయిత్రి సరోజినీనాయుడు జయంతిని పురస్కరించుకొని ఆంగ్ల భాషా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఇంగ్లిష్ టీచర్ సుల్తాన్ శ్రీనివాస్‌ను విద్యార్థులు శాలువాతో సన్మానించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ...ప్రపంచ దేశాలతో సంబంధాలు పెంచుకోవడానికి ఇంగ్లిష్ ఉపయోగపడుతుందని, విద్యార్థులు ఆంగ్లంపై భయం వీడాలన్నారు. అంతకు ముందు సరోజినీ నాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. చిన్నారి అన్విక సరోజినీ నాయుడు వేషధారణ ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమారాణి, ప్రేమ్ సాగర్, బలరాం నాయక్, రవి నాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

చందుర్తి: సనుగుల ప్రాథమిక పాఠశాలలో స్వాతంత్ర్య సమరయోధురాలు, కవయిత్రి సరోజినీదేవి నాయుడు జయంతిని ప్రధానోపాధ్యాయులు కట్కూరి ముఖేశ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఉపాధ్యాయులు ఓరేపు శ్రీనివాస్, మేకల పద్మ, న్యాతరి నాగమణి, చింతల హరిష్మా, యాస నవ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలతో నిష్ణాతులు

ఎల్లారెడ్డిపేట: పోటీ పరీక్షలతో విద్యార్థులను నిష్ణాతులుగా తీర్చిదిద్దవచ్చని మండల విద్యాధికారి కృష్ణహరి అన్నారు. మండలంలోని రాచర్లగొల్లపల్లిలో సరోజినీ నాయుడు జన్మదిన పురస్కరించుకొని ఆంగ్ల భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విద్యార్థులకు డ్రాయింగ్, స్కిట్స్, మోడల్స్, ఉపన్యాస పోటీలను ఏర్పాటు చేశారు. విద్యార్థులు తయారు చేసిన50 వరకు కృత్యాలను పరిశీలించి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లక్ష్మీబాయి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బహుమతి ప్రదానం

తంగళ్లపల్లి: మండలంలోని సారంపల్లి గ్రామంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు గురువారంతో ముగిశాయి. గెలుపొందిన తంగళ్లపల్లి, బద్దెనపల్లి టీమ్‌లకు ఏఎంసీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగంగౌడ్ బహుమతి ప్రదానం చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రవీణ్ మాట్లాడారు. ప్రపంచస్థాయి క్రీడాకారులను తీర్చదిద్దడానికి సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో గచ్చిబౌలిలో స్పోర్ట్స్ యూనివర్శిటీ స్థాపించనున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గుగ్గిళ్ల రాములు, మునిగెల రాజు, భరత్ గౌడ్, కిషన్, గంగారాం, క్రీడాకారులు పాల్గొన్నారు.

గోదావరి నీటికి పూజలు



ముస్తాబాద్: శ్రీరాంసాగర్ గోదావరి జలాలతో మెట్ట ప్రాంతమైన ముస్తాబాద్ మండలం సస్యశ్యామలం అవుతోందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి అన్నారు. మద్దికుంట చెరువులో గోదావరి జలాలకు గురువారం పూజలు చేశారు. ఎస్సారెస్పీ వరద కాల్వ ద్వారా మిడ్‌మానేరుకు నీటిని పంపించి, అక్కడి నుంచి మల్లన్నసాగర్ ద్వారా ముస్తాబాద్ మండలంలోని 10 చెరువులతోపాటు ఎగువ మానేరు ప్రాజెక్టుకు నీరందించేందుకు కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి కృషి చేశారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో సంబంధం లేకుండా ఎస్సారెస్పీ ద్వారా మాజీ సీఎం, దివంగత వైఎస్.రాజశేఖరరెడ్డి ప్రణాళిక మేరకు మిడ్‌మానేరుకు నీరందించి, లక్షలాది ఎకరాలు సాగయ్యేలా చేశారన్నారు. పదేళ్లు అధికారంలో ఉండి, 11వ ప్యాకేజీని పూర్తి చేయలేని కేటీఆర్‌పై రైతులు ఆగ్రహంగా ఉన్నారని పేర్కొన్నారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి కొండం రాజిరెడ్డి, నాయకులు గుండెల్లి శ్రీను, గజ్జెల రాజు, తలారి నర్సింలు, విజయ్‌రెడ్డి, నరేశ్, రాజు, సత్తయ్య, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించాం

గంభీరావుపేట: ఐదేళ్లలో రైతుల సంక్షేమానికి మెరుగైన సేవలందించామని కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు అన్నారు. గురువారం గంభీరావుపేట సింగిల్‌విండో పాలకవర్గ సమావేశంలో మాట్లాడారు. రైతులకు అందుబాటులో ఉంటూ ఎరువులు, విత్తనాల కొరత లేకుండా, సంఘం పరిధిలో గోదాం నిర్మాణం చేపట్టామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రామానుజాగౌడ్, బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, సీఈవో రాజిరెడ్డి, సలహాదారుడు సత్యంరావు, డైరెక్టర్లు కృష్ణారెడ్డి, రాజిరెడ్డి, బీమ్లా నాయక్, రాజిరెడ్డి, దేవారెడ్డి, మురళి, రాజవీర్, రైతులు సురేందర్‌రెడ్డి, దయాకర్‌రావు, మోతె రాజిరెడ్డి, రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

నియామకం



గుండెల్లి కళ్యాణ్‌కుమార్

సిరిసిల్లటౌన్: ఎస్ఎఫ్ఐ సిరిసిల్లా జిల్లా అధ్యక్షుడిగా గుండెల్లి కళ్యాణ్‌కుమార్ నియామకమయ్యారు. ఈమేరకు రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగరపు రజనీకాంత్ ముఖ్య అతిథిగా గురువారం నిర్వహించిన జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ప్రకటించారు. నూతన అధ్యక్షుడికి అభినందనలు వెల్లువెత్తాయి.

'బర్డ్ ఫ్లూ మనుషులకు అరుదుగా సోకుతుంది'

ఇల్లంతకుంట: బర్డ్ ఫ్లూ మనుషులకు అరుదుగా సోకుతుందని ఇల్లంతకుంట పశువైద్యాధికారి ఇందిర అన్నారు. గురువారం బర్డ్ ఫ్లూ వ్యాప్తిని వివరించారు. కోళ్లలో వేగంగా వ్యాపిస్తోందని కోళ్ల ఫారాల్లో పనిచేసేవారికి వ్యాధి సోకే అవకాశం ఉందన్నారు. బాగా ఉడికించిన కోడి గుడ్లు, మాంసం తింటే వ్యాధి సోకదని, ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని, ఫౌల్ట్రీ యజమానులు బయో సెక్యూరిటీ చర్యలు తీసుకోవాలని కోరారు. అనుమానాల నివృత్తికి స్థానిక పశువైద్యాధికారిని సంప్రదించాలని కోరారు.

శిక్షణ వేదిక మార్పు

తంగళ్లపల్లి: మండల కేంద్రంలో శుక్రవారం పీవో, ఏపీవోలకు ఎన్నికల శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.లక్ష్మీనారాయణ తెలిపారు. రైతువేదికలో కాకుండా స్థానిక ఇంపీరియల్ గార్డెన్‌లోకి వేదిక మారిందని, శిక్షణకు వచ్చే పీవో, ఏపీవోలు ఉదయం 10 గంటలలోపు శిక్షణ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

కల్పన స్కాలర్‌షిప్‌కు ఎంపిక

వేములవాడరూరల్: పట్టణంలోని శాత్రాజుపల్లిలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో బీజడ్‌సీ థర్డ్ ఇయర్ చదువుతున్న టి.రమ్య అనే విద్యార్థిని హైదరాబాద్‌లో నిర్వహించిన షి ఫర్ స్టెమ్ ఇంక్యుబేటర్ ప్రోగ్రాం ప్రతిభా పాటవాలు ప్రదర్శించారు. ఆమెకు ఫ్యాబులస్–40(కల్పన స్కాలర్‌షిప్)నకు ఎంపికైనట్లు కళాశాల నిర్వాహకులు తెలిపారు. రమ్య రూ.10వేలు గెలుపొందగా.. కళాశాల ప్రిన్సిపాల్ లావణ్య, వైస్ ప్రిన్సిపాల్ సుమలత, కల్పన, అయేషా, ఫాతిమా, అర్పిత అభినందించారు.

అగ్గి తెగులుపై ఆందోళన వద్దు

వేములవాడరూరల్: వరికి అగ్గి తెగుళ్లు సోకుతున్నాయంటూ రైతుల్లో ఆందోళన అవసరం లేదని మండల వ్యవసాయ అధికారిణి వినీత అన్నారు. వాతావరణ ప్రభావంతో మార్పులు వస్తున్నాయని, వీటి నివారణకు ట్రైసైక్లోజోన్ పిచికారీ చేయాలని సూచించారు. తెగుళ్లు ఎక్కువుంటే తమను సంప్రదించాలన్నారు.

విద్యుత్ సరఫరా చేయాలి

ఎల్లారెడ్డిపేట: పంటలు ఎండిపోకుండా వ్యవసాయానికి నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర అధికార ప్రతినిధి ద్యాప దేవయ్య కోరారు. మండల కేంద్రంలో గురువారం విలేకర్లతో మాట్లాడారు. ప్రస్తుతం ఎన్పీడీసీఎల్ ద్వారా 18 గంటల విద్యుత్ సరఫరా చేస్తామని చెప్పి 17 గంటలకు కుదించడంతో బోరు బావుల కింద సాగుచేసిన పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ అంతరాయం

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లి గ్రామ శివారులోని ఎక్స్‌ప్రెస్ 11 కేవీ ఫీడర్‌లో చెట్ల కొమ్మల కటింగ్, విద్యుత్ తీగల మరమ్మతు కారణంగా ఫీడర్ పరిధిలోని గ్రామాలు నాంపల్లి, అనుపురం, రుద్రవరం, గొల్లపల్లె, సంకెపల్లి, ఆరెపల్లి గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ అంతరాయముంటుందని వేములవాడ అర్బన్ సెస్ ఏఈ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

దరఖాస్తుల పరిశీలన

వీర్నపల్లి: మద్దిమల్ల గ్రామంలో హౌజింగ్ ఈఈ చిన్నయ్య ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారుల ఇళ్లను గురువారం పునఃపరిశీలించారు. ఆన్‌లైన్ లో దరఖాస్తు చేసుకున్నవారి అర్హతలు తెలుసుకున్నారు. వెంట కార్యదర్శి శంకర్, తదితరులున్నారు.



పోచమ్మ బోనాలు

బోయినపల్లి(చొప్పదండి): బోయినపల్లి మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న పెద్దమ్మ తల్లి ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో పోచమ్మ బోనాలు తీశారు. డప్పు చప్పుళ్ల మధ్య మహిళలు నెత్తిన బోనాలతో పోచమ్మ ఆలయానికి తరలివెళ్లారు. దేవతకు నైవేద్యాలు సమర్పించారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



అవగాహన కల్పిస్తున్న రాధికా జైశ్వాల్

సిరిసిల్లటౌన్: విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యనిర్వాహక కార్యదర్శి రాధిక జైశ్వాల్ అన్నారు. గురువారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం ప్రేమలత ఆదేశాల మేరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (నల్సా) ఆధ్వర్యంలో చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ ఫర్ చిల్డ్రన్‌–స్కీం 2024లో భాగంగా లీగల్ ఎయిడ్ క్లినిక్ ఫర్ చిల్డ్రన్ సెంటర్‌ను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణ ముఖ్యమని, ఉన్నత విద్యతో జీవితంలో ఎదగడానికి అవకాశం ఉంటుందన్నారు. రాజ్యాంగబద్ధంగా బాలబాలికలకు హక్కులు, వివిధ చట్టాల గూర్చి అవగాహన కల్పించడం, వినియోగించుకోవడంలో లీగల్ ఎయిడ్ క్లినిక్‌లు ప్రముఖ పాత్ర వహిస్తాయన్నారు. చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ ఎయిడ్ క్లినిక్ ద్వారా జిల్లా వ్యాప్తంగా ఎవరైనా న్యాయ సహాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శారద, లోక్ అదాలత్ మెంబర్లు చింతోజు భాస్కర్, ఆడెపు వేణు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంటా శ్రీనివాస్, న్యాయవాదులు గుర్రం ఆంజనేయులు, అన్సార్, పారా లీగల్ వలంటీర్లు సంతోష్, నరేశ్, చందన, సంజన పాల్గొన్నారు.

వందశాతం 'ఉపాధి' పనులు



మాట్లాడుతున్న డీఆర్డీవో శేషాద్రి

ఎల్లారెడ్డిపేట: జిల్లాలో ఉపాధిహామీ పనులను కూలీలు వందశాతం సద్వినియోగం చేసుకొని, ఆర్థికంగా లబ్ధి పొందుతున్నారని డీఆర్డీవో శేషాద్రి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో గురువారం 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మండల వ్యాప్తంగా ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు అవకతవకలకు పాల్పడిన రూ.35,844 రికవరీ చేశారు. డీఆర్డీవో మాట్లాడుతూ.. ఈ ఆర్థిక సంవత్సరంలో మండలంలో 723 పనులు చేపట్టినట్లు తెలిపారు. ఉపాధిహామీ కూలీలకు రూ.6.59 కోట్లు చెల్లించామని, మెటీరియల్ కోసం రూ.1.2 కోట్లు ఖర్చు చేశామన్నారు. మండల కూలీలు ఉపాధి పనుల సద్వినియోగంలో జిల్లాలో రెండోస్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. ఎంపీడీవో సత్తయ్య, ఏపీవో రామారావు, పీఆర్ ఈఈ శ్రీనివాస్, క్వాలిటీ కంట్రోల్ అధికారి నవీన్, ఏపీవో కొమురయ్య, ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తాటి, ఈతవనం దగ్ధం



కాలుతున్న తాటి చెట్లు

ముస్తాబాద్: మండలంలోని మద్దికుంట ఎల్లమ్మ ఆలయ శివారులో తాటి, ఈతవనం గురువారం దగ్ధమైంది. సమాచారం అందుకున్న సిరిసిల్ల అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. గీతకార్మిక సంఘం అధ్యక్షుడు శంకర్‌గౌడ్ మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన వ్యక్తి తన వ్యవసాయ భూమిలోని తాటి, ఈతచెట్లను ఉద్దేశపూర్వకంగా దహనం చేశాడని ఆరోపించారు. కొద్ది రోజులుగా భూమిపై వివాదం నడుస్తుందని, దాదాపు 80 చెట్లు కాలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశాడు. యాభై మంది గీత కార్మికులు ఉపాధి కోల్పోయారని, చెట్లకు నిప్పు పెట్టిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు.